జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 142 05-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

- సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు
- చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్
- కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి





## వైఎస్ చనిపోయి 17 ఏళ్లు అయ్యాక కూడా ఆరోపణలా?

- పవన్ కల్యాణ్ కు కేవీపీ రామచంద్రరావు లేఖ
- రాజశేఖరరెడ్డిపై విమర్శలు గుప్పించిన పవన్ కల్యాణ్
- పవన్ వ్యాఖ్యలను ఖండించిన కేవీపీ రామచంద్రరావు
- వైసీపీకి, వైఎస్సార్ కు సంబంధం లేదని వ్యాఖ్య
- పాత కక్షలు మర్చిపోవాలని హితవు



# ఏపీ కేబినెట్ భేటీ..

- 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ' నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం
- రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు
- అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు
- పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.ఢలండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (ఐదీఖీూ) పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు

## కూటమి భారీ ప్లాన్..

- రెండేళ్ల పాలన ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ
- టీడీపీకి 3, జనసేనకు 1 రాజ్యసభ స్థానాలు..
- ఎన్డీఏ భేటీలో కుదిరిన ఒప్పందం..
- కూటమి పార్టీల ఉమ్మడి కార్యాచరణ..
- రెండేళ్ల కూటమి పాలన పై కార్యక్రమాలు..
- ఈ నెల 9న. తిరుపతి లో సంక్షేమంపై కార్యక్రమం..

2లో



## దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి

- బియ్యం దొంగతనం చేశానని తనపై ఆరోపణలు చేస్తున్నారన్న పేర్ని నాని
- దమ్ముంటే విచారణ జరిపి జైల్లో పెట్టాలని సవాల్
- డీఎస్సీలో చేసిన పాపాలు చంద్రబాబును, మంత్రులను వదిలిపెట్టవని వ్యాఖ్య



2లో



## భూముల విలువ పెంపు

- రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం
- తెలంగాణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ
- భూముల మార్కెట్ విలువలు, ఛార్జీల పెంపు నేపథ్యంలో జనం పరుగులు
- రద్దీని దృష్టిలో ఉంచుకొని పనివేళలు పొడిగించిన ప్రభుత్వం
- రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అనుమతి

2లో

## నా యుద్ధ అధికారాల్ని పరిమితం చేయడం దేశద్రోహం..



- నలుగురు రిపబ్లికన్లు, డెమోక్రాట్లందరూ దేశ విరోధులు
- డెమోక్రాట్లపై ట్రంప్ ఆగ్రహం

2లో



## ఆరు నెలల్లో 'పాలమూరు' నీరు

- భూసేకరణ తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం పనులు
- భూసేకరణ, పునరావాసానికే తొలుత నిధుల కేటాయింపు
- యుద్ధప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే..
- ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకుంటాం..
- మంత్రులు.. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, అధికారులతో సమన్వయం చేసుకోవాలి..
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష

## శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు..

- రష్యా దిగ్గజానికి లోకేష్ కీలక ప్రతిపాదనలు
- రష్యా పర్యటనలో నోవోస్టల్-ఎం చైర్మన్‌తో మంత్రి లోకేష్ సమావేశం
- భారత్‌లో అత్యాధునిక ఈఏఎఫ్ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విజ్ఞప్తి
- శ్రీసిటీలో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు వైర్ ఫ్యాక్టరీ నిర్మాణంపై చర్చ
- లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న నోవోస్టల్ చైర్మన్




2లో



### అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం..

## స్తంభించిన ట్రాఫిక్

- మైత్రివనం ప్రాంతంలో అగ్నిప్రమాదం
- తొలుత ఆటబొమ్మల దుకాణంలో మంటలు
- క్రమంగా కేఎస్ఆర్ కాంప్లెక్స్‌కు వ్యాప్తి
- ఎలాంటి ప్రాణనష్టం లేదని పోలీసుల వెల్లడి
- పొగ కమ్మేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

2లో

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ బిల్లు.

- మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ బిల్లు
- 2029 ఎన్నికలే లక్ష్యంగా కేంద్రం కసరత్తు?
- సరికొత్త ప్లాన్‌తో వెళ్లబోతున్న కేంద్రం



2లో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం.. స్తంభించిన ట్రాఫిక్

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే. మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.

## శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్, తన పర్యటనలో మూడో రోజు కీలక సమావేశం నిర్వహించారు. రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ 'నోవోస్టల్-ఎం' చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, పలు కీలక ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. భారత్‌లో ప్రస్తుతం పారిశ్రామిక వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని లోకేష్ తెలిపారు. పర్యావరణ అనుమతులు వేగంగా లభిస్తున్నాయని, మౌలిక సదుపాయాల మార్కెట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, అత్యుత్తమ శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) స్టీల్ ప్లాంట్‌ను భారత్‌లో నిర్మించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని కోరారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా ముడిసరుకు అందించేందుకు ప్రత్యేకమైన హార్డ్‌వేర్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని సూచించారు. వీటితో పాటు, ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని, తక్కువ కర్బన ఉక్కు తయారీలో భాగస్వాములు కావాలని ప్రతిపాదించారు.

## భూముల విలువ పెంపు

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

## దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి: పేర్ని నాని సవాల్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్రలను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరారు. "నేను బియ్యం దొంగతనం చేశానని నాపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యముంటే, నాపై విచారణ జరిపించి నన్ను జైల్లో పెట్టండి. 2029 నాటికి చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా పడిపోతుంది. అంతవరకు మీకు చేతనైతే, దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి" అంటూ పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మొదట క్రీడా కోటాను 3 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, ఆ తర్వాత 382 మంది ఎంపికయ్యారని చెప్పిందని.. కానీ ఇటీవలే ఆటల సంఖ్యను 29 నుంచి ఏకంగా 67 కి పెంచి, అందులో 'బ్రిడ్జ్' (పేకాట) ను కూడా చేర్చారని విమర్శించారు.

# ఆరు నెలల్లో 'పాలమూరు' నీరు

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 6 నెలల్లో కర్వెన రిజర్వాయర్ వరకు నీరందించాలని చెప్పారు. దీంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను సత్వరంగా పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టంచేశారు. ప్రధాన భూసేకరణను వేగవంతం చేయాలని, ఈ బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తిచేయాలని సీఎం చెప్పారు. నార్లాపూర్, ఏదుల, కరివెన రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, వీటి లింకేజీకి సంబంధించి పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. వీటికి నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు. నెలవారీగా ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నిధులతో పూర్తయ్యే పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఆరు నెలల్లోగా కరివెన రిజర్వాయర్ వరకు నీళ్లు అందించే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మరో 15 రోజుల తర్వాత ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షిస్తానన్నారు. ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తొలి రోజు గురువారం చకచకా సాగింది. కర్ణాటక రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి పలు ప్రాజెక్టులను సందర్శించారు. కొడంగల్-- నారాయణపేట-- మక్తల్ ఎత్తిపోతలు, గుడ్డెందొడ్డి పంప్‌హౌస్ పనుల ప్రగతిపై స్వయంగా ఆరా తీశారు. కోయిల్‌సాగర్, కృష్ణా, భీమా నదులపై రోడ్ కం బరాజ్‌ల ప్రతిపాదిత స్థలం, జూరాల డ్యామ్‌ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. రాత్రి 10 గంటల వరకు సమీక్ష నిర్వహించిన అనంతరం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో రేవంత్‌రెడ్డి బస చేశారు. శుక్రవారం పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతలు, ఎంజీకేఎల్ఐలో భాగమైన పలు రిజర్వాయర్లు, పంప్‌హౌస్ పనులను పరిశీలించనున్నారు. సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ రోడ్‌లో ఉన్న మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. మక్తల్-- నారాయణపేట-- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిపారుదల రంగాన్ని మరింత బలోపేతం చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీల వారీగా పురోగతిపై రేవంత్‌రెడ్డి ఒక్కో ప్యాకేజీలో పెండింగ్ పనులకు గత కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ బిల్లు..

దేశ రాజకీయాల్లో మరోసారి డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) అంశం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును మళ్లీ పార్లమెంట్ ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఏర్పడిన అంతర్గత సంక్షోభం, తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ పొత్తు విరగడం వంటి తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ అంశం మళ్లీ వేగం అందుకున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ నాయకత్వం టీఎంసీ, డీఎంకే సహా పలు ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. జనాభా మార్పుల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే తమ రాష్ట్రాలకు నష్టం కలుగుతుందనే ఆందోళనలను నివారించడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించడమే ఈ ప్రయత్నాల ఉద్దేశంగా చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. పార్టీకి చెందిన 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి రితబ్రతా బెనర్జీని శాసనసభ పక్ష నేతగా ఎన్నుకుని స్పీకర్ గుర్తింపు కూడా పొందారు. 28 ఏళ్ల చరిత్ర కలిగిన టీఎంసీలో ఇది తొలి అధికారిక చీలికగా భావిస్తున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం అనంతరం టీఎంసీలో అసంతృప్తి పెరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ చేతుల్లో అధికారం కేంద్రీకృతమవుతోందనే భావన కొందరు ఎమ్మెల్యేల్లో పెరిగిందని సమాచారం. ఇప్పుడు ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లో కూడా విభేదాలు చెలరేగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమిళనాడులో చాలా కాలంగా కలిసి సాగిన డీఎంకే-కాంగ్రెస్ సంబంధాలు కూడా ఇటీవల దెబ్బతిన్నాయి. ముఖ్యమంత్రి పదవికి టీవీకే అధినేత విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నుంచి వైదొలగి విజయ్‌కు మద్దతు ఇవ్వడంతో ఇరు పార్టీల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలో డీఎంకే శాసనసభ్యుల సమావేశంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తూ తీర్మానం ఆమోదించారు. అంతేకాకుండా డీఎంకే ఎంపీ కనిమొళి లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుల నుంచి తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు లేఖ రాశారు. ఇక జూన్ 8న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే దూరమైంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం, మహిళా రిజర్వేషన్ అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లు ఈ ఏడాది ఏప్రిల్ 18న లోక్‌సభలో ఓటింగ్‌కు వెళ్లి విఫలమైంది. బిల్లుకు అనుకూలంగా 298 మంది సభ్యులు ఓటు వేయగా.. 230 మంది వ్యతిరేకించారు. అయితే రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఆ బిల్లు ప్రకారం 2011 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ నిర్వహించి 2029 ఎన్నికల నాటికి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కు పెంచే ప్రతిపాదన ఉంది.

## వైఎస్ చనిపోయి 17 ఏళ్లు అయ్యాక కూడా ఆరోపణలా?

దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడేవారంటూ పవన్ చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ సీనియర్ నేత, వైఎస్సార్ ఆత్మబంధువు డాక్టర్ కేవీపీ రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఒక ఘాటు బహిరంగ లేఖను సంధించారు. "కాంగ్రెస్ అనగానే మీకు వైఎస్సార్ గుర్తుకు వచ్చినందుకు ధన్యవాదాలు" అంటూనే... వైఎస్సార్‌పై పవన్ చేసిన ఆరోపణలను కేవీపీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ముఖ్యమైన రాజకీయ అంశాన్ని స్పష్టం చేశారు. వైఎస్సార్‌కు, ప్రస్తుత వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని కేవీపీ తేల్చి చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పవన్ పై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదని కేవీపీ గుర్తు చేశారు. నాడు వైఎస్సార్ కేసులు పెట్టమన్నారంటూ ఓ పోలీస్ అధికారికి తనకు చెప్పినట్టు పవన్ అంటున్నారని, ఆ పోలీస్ అధికారికి తక్షణమే లై డిటెక్టర్ పరీక్ష చేయించాలని కేవీపీ డిమాండ్ చేశారు. "ఒకవేళ ఆ అధికారి చెప్పింది నిజమని తేలితే... నేను తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 కోట్లు విరాళంగా ఇస్తాను" అంటూ కేవీపీ ఒక బహిరంగ సవాల్ విసిరారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి చనిపోయి 17 ఏళ్లు దాటిన తర్వాత కూడా.. ఇంకా ఆయనపై ఇలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అవివేకమని మండిపడ్డారు.

## నా యుద్ధ అధికారాల్ని పరిమితం చేయడం దేశద్రోహం

ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు తుది దశ చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇదే సమయంలో తన యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానాన్ని అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఆమోదించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తన దౌత్య ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. ట్రూత్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులో... "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తుది దశ చర్చలు జరుగుతున్న సమయంలో హౌస్ అర్థంలేని ఓటింగ్ నిర్వహించింది. నలుగురు రిపబ్లికన్లు, డెమోక్రాట్లందరూ కలిసి నా యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి మద్దతు ఇచ్చారు" అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు ఏ దశలో ఉన్నాయో కాంగ్రెస్ సభ్యులకు పూర్తిగా తెలుసని, అయినప్పటికీ ఇలాంటి చర్యలకు పాల్పడటం దేశభక్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. "ఇలాంటి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన పని ఎవరు చేస్తారు?" అని ప్రశ్నించారు. చివరగా 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ నినాదాన్ని ప్రస్తావిస్తూ తన మద్దతుదారులకు సందేశం పంపించారు.

## ఏపీ కేబినెట్ భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు. బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు. అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది.

## కూటమి భారీ ప్లాన్..

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి పార్టీల మధ్య రాజ్యసభ స్థానాల పంపకం దాదాపు ఖరారైంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రానికి కేటాయించిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడు టీడీపీకి, ఒక స్థానం జనసేనకు దక్కనున్నాయి. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. అమరావతిలో జరిగిన కూటమి పార్టీల సమావేశం అనంతరం మాట్లాడిన పల్లా శ్రీనివాస్, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికతో పాటు కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సంయుక్త కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను వివరించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీన తిరుపతిలో సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 13, 16, 17, 18, 19 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని వివరించారు.



## పొట్టిమర్రి బ్రిడ్జి పనుల్లో నాణ్యతా లోపాలు: కాల్వపల్లి మాజీ సర్పంచ్ ఆరోపణ


- సాంకేతిక నిబంధనలను పక్కనబెట్టి నిర్మాణాలు
- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని పొట్టిమర్రి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో తీవ్ర నాణ్యత లోపాలు చోటుచేసుకుంటున్నాయని కాల్వపల్లి మాజీ సర్పంచ్ గుంటి కృష్ణ ఆరోపించారు. గురువారం ఆయన వాగుపై జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల రవాణా సౌకర్యార్థం అత్యంత కీలకమైన ఈ బ్రిడ్జి నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి పనులు నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి చేపడుతున్న ఇటువంటి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ, ప్రస్తుత నిర్మాణంలో ఉపయోగించాల్సిన నాణ్యమైన సిమెంట్, కంకర, ఇసుక, గేజ్ స్టీల్ రాడ్లను సరైన ప్రమాణాలతో వినియోగించడం లేదని ఆయన పేర్కొన్నారు. పనుల్లో కనీస సాంకేతిక నిబంధనలను పాటించకపోవడం వల్ల భవిష్యత్తులో వంతెన మన్నికపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పనులను వేగవంతం చేయాలనే నెపంతో నాణ్యతను బలిపెట్టడం సరికాదన్నారు. సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, అవసరమైతే సాంకేతిక నిపుణులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతను పరీక్షించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ డైరెక్టర్‌కు మోత్కుపల్లి వినతి

- దళితుల భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి
- మాదిగ మహా శక్తి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పణ



**తొలివెలుగు, రాజాపేట:** మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు గురువారం ఢిల్లీలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (ఎస్సీ, ఎస్టీ) జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల వర్గాలకు చెందిన భూముల సేకరణ, అక్రమ ఆక్రమణలు, వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై మాదిగ మహా శక్తి ఆధ్వర్యంలో ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితుల భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్సీల సాగు భూములను అక్రమంగా లాక్కోవడం, ఆక్రమించుకోవడం వంటి ఘటనలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత దళిత కుటుంబాలకు తక్షణమే న్యాయం జరిగేలా జాతీయ కమిషన్ చొరవ చూపాలని, రాజ్యాంగబద్ధంగా వారికి సంక్రమించిన హక్కులను కాపాడాలని డైరెక్టర్‌ను కోరారు. అణగారిన వర్గాల ప్రయోజనాలే పరమావధిగా ఈ వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి, గొర్రెల మృతి: కురుమ సంఘం సంతాపం

- ప్రభుత్వం తరపున తక్షణ సదుపాయాలు కల్పించి ఆదుకోవాలి
- నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాధిత కుటుంబానికి రాజాపేట నేతల సానుభూతి



**తొలివెలుగు, రాజాపేట:** గొర్రెల మేత కోసం గుంటూరు జిల్లాకు వెళ్లి తిరిగి వస్తుండగా డిండి మండలం ఎర్రగొండపాలెం సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడూరు మండలానికి చెందిన గొర్రెల కాపరి చిటకొండ ఎల్లయ్య మృతి చెందడం పట్ల రాజాపేట మండల కురుమ సంఘం నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఘోర ప్రమాదంలో ఎల్లయ్య ప్రాణాలు కోల్పోవడంతో పాటు, మూడు డీసీఎం వాహనాలలో తరలిస్తున్న సుమారు 200 గొర్రెలు మృత్యువాత పడటం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. నిత్యం గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల, పిడుగుపాట్లు, పాముకాట్లు, కుక్కల దాడుల కారణంగా గొర్రెల మందలు నిరంతరం నష్టపోతున్నాయని, ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో గొర్రెలు చనిపోవడం ఆ కుటుంబాలను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రమాదాలకు గురవుతున్న గొర్రెల కాపరులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల సదుపాయాలను సత్వరమే అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు గౌర బక్కయ్య, కర్రె వెంకటేష్, రేగు సిద్ధులు, చిన్నం బాలరాజు, రేగు శ్రీశైలం, పోసుకొండ బాబు, గవ్వల భారత్, వట్టిపల్లి రాములు, పలువురు కురుమ కులస్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో మున్సిపాలిటీలకే ప్రాధాన్యత





- త్వరలోనే అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ: అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు
- పోచంపల్లిలో ముమ్మరంగా ప్రజా పాలన వార్డు సభలు

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు మూర్తి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులలో మున్సిపాలిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు వెల్లడించారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో గురువారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 1, 2, 3 వార్డుల్లో వార్డు సభలను నిర్వహించారు. ఇందులో భాగంగా రేవనపల్లిలోని 3వ వార్డు సభకు అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ వార్డు సభలను ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందించేందుకు అధికార యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోందన్నారు. సింగన్నగూడెంలో ఇప్పటికే ఇండ్లకు సంబంధించిన మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని, త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా పోచంపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతుల కల్పన కోసం టెండర్లను ఆహ్వానించామని, పనులను వేగవంతం చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగానే ఇండ్లను అప్పగిస్తామని వివరించారు. వార్డుల్లో ఇబ్బందికరంగా మారిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, కౌన్సిలర్ రావుల జంగయ్య, మండల వైద్యాధికారి శ్రీవాణి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, వార్డ్ ఆఫీసర్ రాజేష్, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్ బి ఖదీర్, నాయకులు రావుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**వైద్యులు ప్రవర్తన మార్చుకోవాలి:**

వార్డు సభలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కొంతమంది వైద్య అధికారుల ప్రవర్తన రోగుల పట్ల సరిగా లేదని స్థానిక ప్రజలు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన తక్షణమే స్పందిస్తూ, వేదికపైనే ఉన్న మండల వైద్యాధికారిణిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగుల పట్ల వైద్యులు తమ ప్రవర్తనను మార్చుకోవాలని సూటిగా ఆదేశించారు. ప్రజల అభిమానాన్ని చూరగొనేలా సానుభూతితో వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.

## రాజాపేట మండలంలో ముమ్మరంగా ధాన్యం సేకరణ

- మూడు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి.. మరో ఆరు చోట్ల ముగింపు దశకు..
- రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారుల నిరంతర పర్యవేక్షణ

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని 20 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మండలంలో ఇప్పటికే మూడు కేంద్రాల్లో నూరు శాతం కొనుగోళ్లు పూర్తి కాగా, మరో ఆరు కేంద్రాల్లో రానున్న మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు స్థానిక తహసిల్దార్ వల్లపు ప్రదీప్ క్షేత్రస్థాయి పర్యవేక్షణ, రేణిగుంట పీఏసీఎస్ సీఈవో సిల్వర్ శేఖర్ ప్రత్యేక సహకారంతో కొనుగోళ్లలో వేగం పుంజుకుంది. మండలంలో మహిళా సమాఖ్య (ఐకేపీ) ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు నడుస్తుండగా, ఇప్పటివరకు 1.10 లక్షల బస్తాల ధాన్యం సేకరించారు. మరో 20 వేల బస్తాల సేకరణ బాకీ ఉంది. రఘునాథపురం, బసంతాపురం గ్రామాల్లోని మహిళా కొనుగోలు కేంద్రాల్లో మరో మూడు రోజుల్లో సేకరణ పూర్తి కానుంది. అదేవిధంగా పీఏసీఎస్ పరిధిలోని 14 కేంద్రాల్లో ఇప్పటివరకు పుట్టగూడెం, మొల్లగూడెం, కాల్వపల్లి గ్రామాల్లో రైతుల నుండి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరించారు. మిగిలిన కేంద్రాలైన చల్లూరు, పాముకుంట, లక్ష్మక్కపల్లి, సోమవారం గ్రామాల్లో మరో మూడు రోజుల్లో కొనుగోళ్లు ముగియనున్నాయి. పీఏసీఎస్ ద్వారా ఇప్పటివరకు 3 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేయగా, మరో 25 వేల బస్తాల ధాన్యం సేకరించాల్సి ఉంది. నిల్వ గోదాములు, హమాలీలు, లారీల కొరత రాకుండా తహసిల్దార్ ప్రదీప్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.



## ఘనంగా మహేష్ మాదిగ-మాధవిల వివాహ దినోత్సవం..

- రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖుల అభినందనల జడివాన
- కృతజ్ఞతలు తెలిపిన ఎమ్ఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్

**తొలివెలుగు, రాజాపేట:** మండలం కాల్వపల్లి గ్రామంలో ఎమ్ఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ, మాధవిల పెళ్లిరోజు వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా వారికి రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు వీఐపీల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలు (ఆర్ అండ్ బీ), సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్యలు ప్రత్యేకంగా ఫోన్ చేసి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీ నేతలు, మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, విద్యుత్ శాఖ కార్మిక ప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు ఈ వేడుకల్లో భాగస్వామ్యులయ్యారు. రాజాపేట మండల సర్పంచులు, అన్ని పార్టీల మండల స్థాయి నాయకులు, అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున అభినందనలు కురిపించారు. తమపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపిస్తూ, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు మహేష్ మాదిగ, మాధవి దంపతులు ఈ సందర్భంగా తొలివెలుగు ప్రతినిధికి వివరించారు.



## సర్కారు బడి.. ప్రగతికి అడిడుగుజాడి.. రఘునాథపురంలో 'బడిబాట'






- జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన విద్యాసంస్థ మనది: సర్పంచ్, ఎంఈఓ
- గ్రామంలో ఇంటింటా తిరిగి అవగాహన కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, రాజాపేట:** మండలం రఘునాథపురం గ్రామంలో గురువారం 'బడిబాట' కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థుల నమోదు పెంపుకై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, మండల విద్యాధికారి చందా రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ బడి వయసు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొంది, జిల్లా స్థాయిలో రికార్డుల పరంపరను కొనసాగిస్తున్న రఘునాథపురం సంగిశెట్టి నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పాఠశాల ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్ది జిల్లా ర్యాంకులను కైవసం చేసుకుందని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని వివరించారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా విద్యా ప్రమాణాలు ఉన్న మన ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# మిత్రుడి కుటుంబానికి 'పదో తరగతి' దోస్తుల ఆసరా!

- రూ. 25 వేల నగదు అందజేసి మానసిక ధైర్యం కల్పించిన స్నేహితులు
- పాముకుంటలో మానవీయత చాటుకున్న 2005-2006 బ్యాచ్

**తొలివెలుగు, రాజాపేట:** కష్టాల్లో ఉన్న తోటి మిత్రుని కుటుంబానికి అండగా నిలిచి తమ స్నేహాన్ని చాటుకున్నారు రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన పాత విద్యార్థులు. పాముకుంట గ్రామానికి చెందిన జంగ నరేష్ ఇటీవల అకాల మరణం చెందడంతో అతని కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషయాన్ని గమనించిన అతని తోటి పాఠశాల స్నేహితులు (2005–2006 ఎస్ఎస్‌సీ బ్యాచ్) గురువారం ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. బ్యాంకు, ఇతర మార్గాల ద్వారా మిత్రులందరూ కలిసి రూ. 25,000 నగదును విరాళంగా సేకరించారు. గురువారం మరణించిన నరేష్ నివాసానికి వెళ్లిన స్నేహితుల బృందం, సేకరించిన నగదును అతని కుటుంబ సభ్యులకు అందజేసి తగిన మానసిక ధైర్యాన్ని చెప్పారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రుల బృందంతో పాటు రాజాపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, పాముకుంట గ్రామ సర్పంచ్ రంగ నరేష్ గౌడ్, గొడుగు యాకూబ్, పట్నం బాలరాజు, గుంటి అనిల్, కోటగిరి సాయిబాబా, గొడుగు లింగం తదితరులు పాల్గొన్నారు. తోటి స్నేహితుని కోసం ఆర్థికంగా సహకరించిన ప్రతీ ఒక్కరికీ ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి హైటెక్స్‌లో 'థ్రెడ్ టు పోచంపల్లి' ప్రదర్శన

- ఇక్కత్ చేనేత కళకు విస్తృత ప్రచారమే లక్ష్యం
- మూడు రోజుల పాటు వస్త్ర ప్రదర్శన: యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి




**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు మూర్తి):** సాంప్రదాయ పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు అంతర్జాతీయ స్థాయిలో మరింత బహుళ ప్రచారం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ వేదికగా 'థ్రెడ్ టు పోచంపల్లి' పేరిట మూడు రోజుల పాటు ప్రత్యేక చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో (శుక్ర, శని, ఆదివారాలు) కొనసాగే ఈ మెగా ప్రదర్శనను శుక్రవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రులు అధికారికంగా ప్రారంభించనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వెల్లడించారు. గురువారం ఆయన ఎగ్జిబిషన్ ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం వివరాలను వెల్లడించారు. హైటెక్స్‌లో ఇప్పటికే 100కు పైగా అత్యాధునిక చేనేత స్టాళ్లను ముస్తాబు చేశామని, చేనేత వస్త్రాల విక్రయాలకు సర్వం సిద్ధమైందని తెలిపారు. నగరవాసులకు పోచంపల్లి సాంప్రదాయ వస్త్రకళపై, ఇక్కత్ నేత కార్మికుల శ్రమపై పూర్తి అవగాహన కల్పించే సదుద్దేశంతోనే ఈ అరుదైన వేదికను సిద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా చేనేత వస్త్ర వ్యాపారులకు, నేత కార్మికులకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే వీలు కలుగుతుందని, తద్వారా వారికి మంచి లాభాలు చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వస్త్ర ప్రదర్శనతో పాటు నగర ప్రజలకు యాదాద్రి ప్రాంతీయ రుచులను పరిచయం చేసేలా స్థానిక వంటకాలతో ప్రత్యేక ఫుడ్ స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.


# బాధిత కుటుంబానికి ముద్దసాని కిరణ్ రెడ్డి ఆర్థిక సాయం

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు పరామర్శ
- రూ. 5 వేల నగదు అందజేత.. అండగా ఉంటామని భరోసా



**తొలివెలుగు, వలిగొండ:** ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన శ్యామలా వెంకటేష్ ఇటీవల బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ప్రజ్ఞాపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముద్దసాని కిరణ్ రెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 5,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. అధైర్యపడవద్దని, కుటుంబానికి తమ వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొగిలిపాక గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్, మచ్చ సునీత స్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చ నవీన్, శ్యామల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగులపైకి బుల్డోజర్



- సీఎం మీటింగ్ కోసం పేదలపై ప్రతాపం
- మియాపూర్‌లో పలు దుకాణాల కూల్చివేత

మియాపూర్: పేదలపై మరోసారి బుల్డోజర్‌తో విరుచుకుపడ్డారు. వీధి వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న వందలాది కుటుంబాలను రోడ్డునపడేశారు. మియాపూర్ మెట్రో సమీపంలోని సోఫా దుకాణాలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసు పహారా మధ్య యంత్రాల సాయంతో నేలమట్టం చేశారు. ఏండ్ల తరబడి సోఫా విక్రయాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ అంశంపై కోర్టులో కేసు కొనసాగుతున్నా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా తమ దుకాణాలను కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సీఎం సమావేశం పేరుతో దుకాణాలను కూల్చివేసి వందలాది కుటుంబాలను రోడ్డుమీద పడేశారని బాధితులు వాపోయారు. 'ప్రాధేయపడినా.. వినకుండా మమ్మల్నీ ఈడ్చేసి దుకాణాలను కూలగొట్టి మా పొట్టకొట్టారు. సీఎం సమావేశం కోసం మా దుకాణాలనే ఎందుకు తొలగించారు. మా వీధి వ్యాపారాలపై కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోకుండా నోటీసు లేకుండా కూల్చివేయడం దారుణం'.అని బాధితుడు ఏడుకొండలు వాపోయారు.

# నిజాయితీ చాటిన టేకుల సోమారం యువకులు

- రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్ పోలీసులకు అప్పగింత
- యువకుల బాధ్యతాయుత వైఖరిపై సర్వత్రా ప్రశంసలు

**తొలివెలుగు, వలిగొండ:** సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ తమ నిజాయితీని చాటుకున్నారు వలిగొండ మండలం టేకులసోమారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు. రోడ్డుపై పడి ఉన్న విలువైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, దానిని పోలీసులకు అప్పగించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. టేకులసోమారం గ్రామానికి చెందిన నరగొని మురళి, చేగూరి వంశీ రాజ్ అనే యువకులు బుధవారం రాత్రి భువనగిరి పట్టణంలో జరిగిన ఒక శు భకార్యానికి హాజరయ్యారు. వేడుక ముగిసిన అనంతరం వారు తిరిగి తమ గ్రామానికి వస్తుండగా, చిట్యాల – భువనగిరి ప్రధాన రహదారిపై నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటాన్ని గమనించారు. ఆ ఫోన్‌ను వారు భద్రపరిచారు. దాన్ని తమ వద్దే ఉంచుకోకుండా, అసలైన యజమానికి చేర్చాలనే సదుద్దేశంతో గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఆ ఫోన్‌ను క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా యువకుల నిజాయితీని, బాధ్యతాయుత వైఖరిని స్థానికులతో పాటు పోలీసు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. దొరికిన వస్తువులను పోలీసులకు అప్పగించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చారని పలువురు కొనియాడారు.







# నేడే డెల్టా పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం

- ప్రారంభించనున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- కార్పొరేట్ స్థాయిలో 20 అత్యాధునిక తరగతి గదుల నిర్మాణం

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డెల్టా హైస్కూల్ భవన ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ నూతన పాఠశాల భవనాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. వలిగొండ నుంచి భువనగిరి వెళ్లే ప్రధాన రహదారి పక్కన, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో సుమారు 1500 చదరపు గజాల విశాలమైన విస్తీర్ణంలో, పెద్ద ఆట స్థలంతో కూడిన ఆవరణలో ఈ నూతన పాఠశాల భవనాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ?మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాల యాజమాన్యం 20 అత్యాధునిక తరగతి గదులను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎయిర్ కండిషన్డ్ (ఏసీ) గదులలో డిజిటల్ క్లాసుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత 15 సంవత్సరాలుగా వలిగొండలో విద్యా సేవలు అందిస్తున్న డెల్టా పాఠశాల, ప్రతి ఏటా పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ వస్తోంది. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. అదే స్ఫూర్తితో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలను, వసతులను తక్కువ ఖర్చుతో అందించేందుకు ఈ భవనాన్ని నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. భద్రతకు పెద్దపీట వేస్తూ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, నలువైపులా సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగే ఈ ప్రారంభోత్సవ వేడుకలో విద్యార్థుల తల్లిదండ్రులు, మండల ప్రజలు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పాఠశాల కరస్పాండెంట్ పబ్బు శ్రీధర్, ప్రిన్సిపాల్ వెంకటేష్ ఒక ప్రకటనలో కోరారు.

# వెలువర్తి మత్స్య పారిశ్రామిక సంఘం డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం



- తొమ్మిది మంది సభ్యుల ఏకగ్రీవ ఎంపిక
- ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కుర్ర సురేష్

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ డైరెక్టర్ల ఎన్నిక గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. సంఘం డైరెక్టర్ల స్థానాలకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో పోటీ లేకుండా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల అధికారిగా కుర్ర సురేష్ వ్యవహరించి పర్యవేక్షించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లుగా దుద్దు అండాలు, చెవ్వ ఎల్లమ్మ, దుద్దు ఆంజనేయులు, మారబోయిన అంజయ్య, సూరబోయిన దయాకర్, నిమ్మల శేఖర్, మారబోయిన పరుశురాం, బత్తెపు శేఖర్, బోల్లబోయిన శేఖర్‌లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. అనంతరం గెలుపొందిన నూతన డైరెక్టర్లు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి, సంఘం అభివృద్ధికి తమ వంతు శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు మహాసభ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, భత్తెపు రంగనాథ్, మారబోయిన మత్స్యగిరి, చెవ్వ రాజు ముదిరాజ్, బత్తెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వో ఫిల్టర్‌కు మహర్దశ.. ముమ్మరంగా మరమ్మతు పనులు

- పనులకు శ్రీకారం చుట్టిన కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్
- దివీస్ పరిశ్రమ సహకారంతో త్వరలో అందుబాటులోకి శుద్ధ జలం
- కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. గత కొంతకాలంగా మూలనపడిన ఆర్వో వాటర్ ప్లాంట్లకు మోక్షం కలుగుతోంది. మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు రాంనగర్ కాలనీలో ఆగిపోయిన ఆర్వో ఫిల్టర్ మరమ్మతు పనులను కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, స్థానిక దివీస్ పరిశ్రమల యాజమాన్యం సంయుక్త సహకారంతో ఈ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వాణి మాట్లాడుతూ.. రాంనగర్ కాలనీలో గత కొన్నేళ్లుగా ఆర్వో వాటర్ ఫిల్టర్ పనిచేయకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గతంలో ఈ ఫిల్టర్‌ను దివీస్ పరిశ్రమ వారే నిర్మించిన నేపథ్యంతో, మరమ్మతుల విషయాన్ని సదరు పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజా సమస్యపై తక్షణమే స్పందించిన దివీస్ యాజమాన్యం బోరు, ఫిల్టర్ మరమ్మతు పనులను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా గురువారం ముందుగా బోరు మరమ్మతులు నిర్వహించగా, బోరులో సమృద్ధిగా భూగర్భ జలాలు ఉండటంతో ప్రజలు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. అతి త్వరలోనే మరమ్మతులు పూర్తి చేసి వార్డు ప్రజలకు ఫిల్టర్ నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వర్కాల కుమార్ గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్, మార్గం నర్సింహ్మా యాదవ్, చెరుకు అశోక్ గౌడ్, గూయని జంగయ్య, చెరుకు సాయి గౌడ్, దివీస్ పరిశ్రమ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు సభలు







- చౌటుప్పల్‌లో విజయవంతంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'
- వినతులు స్వీకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' (99 రోజుల కార్యాచరణ) వార్డు సభలు చౌటుప్పల్ పురపాలక సంఘంలో విజయవంతంగా సాగాయి. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3, 12, 13వ వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలను ఏర్పాటు చేశారు. ఈ సభలకు చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ప్రజల నుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో చౌటుప్పల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంతరాయంగా సాగిన ఈ సభలలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ, వార్డుల్లో తడి, పొడి చెత్త వేరుచేయడం మరియు వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ హాజరై, ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల, మత్తు పదార్థాల నివారణపై యువత, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థానిక ప్రభుత్వ వైద్యులు డా. కాటమరాజు మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆయా వార్డుల్లో జరిగిన సభలకు కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్, పాక చిరంజీవి అధ్యక్షత వహించారు. ప్రజలు తమ వీధుల్లోని డ్రైనేజీ, తాగునీరు, అంతర్గత రహదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా ఒకే వేదికపైకి వచ్చి సమస్యలను ఆలకించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# బ్యాంక్ అకౌంట్లో డబ్బులు కట్ అవుతున్నాయా?



మీ పర్మిషన్ లేకుండా బ్యాంకులు డబ్బులు తీసుకోగలవా? బ్యాంకు ఖాతాలో డబ్బు భద్రంగా ఉంటుందని చాలామంది భావిస్తారు, కానీ కొన్ని సందర్భాల్లో మన అనుమతి లేకుండానే నగదు కట్ అవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తుంటాయి. అయితే బ్యాంకులు మీ అనుమతి లేకుండా నగదు తీసుకోగలవా? అసలు నిజాలివే! చాలామంది తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు భద్రంగా ఉంటాయని, తాము సంతకం చేయకుండా లేదా ఓటీపీ (ూఊూ) చెప్పకుండా రూపాయి కూడా బయటకు వెళ్లదని నమ్ముతారు. కానీ, ఒక్కోసారి మొబైల్‌కు వచ్చే డెబిట్ మెసేజ్‌లు చూసి కంగారు పడుతుంటారు. మనకు తెలియకుండానే ఖాతాలో నగదు కట్ అయినప్పుడు బ్యాంకులపై కోపం రావడం సహజం. చాలామంది తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు భద్రంగా ఉంటాయని, తాము సంతకం చేయకుండా లేదా ఓటీపీ (ూఊూ) చెప్పకుండా రూపాయి కూడా బయటకు వెళ్లదని నమ్ముతారు. కానీ, ఒక్కోసారి మొబైల్‌కు వచ్చే డెబిట్ మెసేజ్‌లు చూసి కంగారు పడుతుంటారు. మనకు తెలియకుండానే ఖాతాలో నగదు కట్ అయినప్పుడు బ్యాంకులపై కోపం రావడం సహజం. అయితే, బ్యాంకులు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఖాతాదారుల అనుమతి లేకుండా లేదా ముందస్తు సమాచారం ఉన్న నిబంధనల ప్రకారం డబ్బులు తీసుకునే హక్కును కలిగి ఉంటాయి. ఆ పరిస్థితులు ఏంటో అవగాహన ఉంటే ఇలాంటి ఆందోళనలను దూరం చేసుకోవచ్చు. అయితే, బ్యాంకులు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఖాతాదారుల అనుమతి లేకుండా లేదా ముందస్తు సమాచారం ఉన్న నిబంధనల ప్రకారం డబ్బులు తీసుకునే హక్కును కలిగి ఉంటాయి. ఆ పరిస్థితులు ఏంటో అవగాహన ఉంటే ఇలాంటి ఆందోళనలను దూరం చేసుకోవచ్చు.హిందీ వెల్లడించిన కథనం ప్రకారం.. ముఖ్యంగా మనం ఖాతా తెరిచే సమయంలోనే కొన్ని సేవా రుసుములకు అంగీకరిస్తాం. వీటినే బ్యాంకింగ్ ఛార్జీలు అంటారు. ఉదాహరణకు, ఏటీఎం కార్డు వాడినందుకు ఏటా తీసుకునే రుసుము, ఎస్ఎంఎస్ అలర్ట్ ఛార్జీలు, చెక్కు బుక్ జారీ చేసినందుకు అయ్యే ఖర్చు వంటివి బ్యాంకులు నేరుగా ఖాతా నుండి మినహాయించుకుంటాయి. వీటితో పాటు, కనీస బ్యాలెన్స్ (వీఱఅఱఎబఎ దీఋశ్రీఋఅషెవ) నిర్వహించని పక్షంలో విధించే జరిమానాలను కూడా బ్యాంకులు అడగకుండానే వసూలు చేస్తాయి. ఇవన్నీ మనం ఖాతా ప్రారంభంలో సంతకం చేసిన పత్రాల్లోని నిబంధనల ప్రకారమే జరుగుతాయి. వెల్లడించిన కథనం ప్రకారం.. ముఖ్యంగా మనం ఖాతా తెరిచే సమయంలోనే కొన్ని సేవా రుసుములకు అంగీకరిస్తాం. వీటినే బ్యాంకింగ్ ఛార్జీలు అంటారు. ఉదాహరణకు, ఏటీఎం కార్డు వాడినందుకు ఏటా తీసుకునే రుసుము, ఎస్ఎంఎస్ అలర్ట్ ఛార్జీలు, చెక్కు బుక్ జారీ చేసినందుకు అయ్యే ఖర్చు వంటివి బ్యాంకులు నేరుగా ఖాతా నుండి మినహాయించుకుంటాయి. వీటితో పాటు, కనీస బ్యాలెన్స్ (వీఱఅఱఎబఎ దీఋశ్రీఋఅషెవ) నిర్వహించని పక్షంలో విధించే జరిమానాలను కూడా బ్యాంకులు అడగకుండానే వసూలు చేస్తాయి. ఇవన్నీ మనం ఖాతా ప్రారంభంలో సంతకం చేసిన పత్రాల్లోని నిబంధనల ప్రకారమే జరుగుతాయి.



# మత్స్యకారులపై అక్రమ కేసులు దారుణం

- అడ్డగూడూరు ఎస్ఐ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ధ్వజం
- రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తాం: ఎల్.వి. రమణ ముదిరాజ్

**తొలివెలుగు, అడ్డగూడూరు:** మండలం ధర్మారం గ్రామ మత్స్యకార సహకార సంఘం పరిధిలోని చెరువుల్లో చేపల దొంగతనానికి పాల్పడిన వారిని వదిలి, బాధితులైన మత్స్యకారులపైనే అక్రమ కేసులు నమోదు చేయడం దారుణమని తెలంగాణ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వి. రమణ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. గురువారం మండల పరిధిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మారం చెరువుల్లో అక్రమంగా చేపల దొంగతనానికి పాల్పడుతున్న దుండగులను స్థానిక మత్స్యకారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పగించినప్పటికీ, న్యాయం చేయాల్సిన స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఏకపక్షంగా వ్యవహరిస్తూ దొంగలకే వత్తాసు పలకడం సిగ్గుచేటని మండిపడ్డారు. మత్స్యకారుల జీవనాధారమైన చెరువులను, వారి హక్కులను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని, బాధిత మత్స్యకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మత్స్యకారుల ముదిరాజుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనిల్, ధర్మారం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దాసరి ఈశ్వర్, దాసరి పులేందర్, కార్యదర్శి దాసరి బిక్షం, సభ్యులు రామచంద్రు, మహేష్, శ్రీను, మధు, నారాయణ, దశరథ, సోమలక్ష్మి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం


- రూ. 26,500 నగదు అందజేసి మానవత్వం చాటుకున్న వైనం
- ఆసరాగా నిలిచిన కోటమర్తి జెడ్పీహెచ్ఎస్ 2001 బ్యాచ్ విద్యార్థులు



**తొలివెలుగు, అడ్డగూడూరు:** మరణించిన స్నేహితుడి కుటుంబానికి తామున్నామంటూ చిన్ననాటి మిత్రులు ముందుకు వచ్చి అండగా నిలిచారు. అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన రాపోలు రమేష్ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రమేష్ చిన్ననాటి స్నేహితులు, కోటమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్) ఎస్ఎస్‌సీ 2001 బ్యాచ్ క్లాస్‌మేట్స్ అందరూ ఒకతాటిపైకి వచ్చారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రమేష్ కుటుంబానికి ఆసరాగా నిలవాలని నిర్ణయించుకుని, తమ బ్యాచ్ మిత్రులందరి నుంచి విరాళాలు సేకరించారు. గురువారం కోటమర్తి గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ. 26,500 నగదును తక్షణ ఆర్థిక సహాయం కింద అందజేశారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని మిత్రులు భరోసా ఇచ్చారు. కష్టకాలంలో స్పందించి ఆర్థిక సాయం అందించిన స్నేహితులకు రమేష్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు లాధినేని వెంకన్న, కుంటా వెంకట్ రెడ్డి, గునిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పులిగిల్లలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

- మృతురాలి కుటుంబానికి రూ. 20,000 అందజేసిన కాంగ్రెస్ నాయకులు
- క్షతగాత్రులకు నక్కల మాధవరెడ్డి చేయూత





**తొలివెలుగు, వలిగొండ:** మండలం పులిగిల్ల గ్రామంలో అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ?వివరాల్లోకి వెళితే.. పులిగిల్ల గ్రామానికి చెందిన బండారి పెంటమ్మ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మరణించారు. అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో సదరు కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నక్కల మాధవరెడ్డి రూ. 10,000, కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి రూ. 5,000, బుగ్గ మనోజ్ కుమార్ రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే, అదే గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న పల్లెర్ల యాదయ్యకు రూ. 10,000, దొడ్డి దాసు అనే వ్యక్తికి రూ. 5,000 సహాయాన్ని నక్కల మాధవరెడ్డి వ్యక్తిగతంగా అందజేసి అండగా నిలిచారు. ఈ వితరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేశం, వాకిటి సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు పర్వతం సంతోష, సిలువేరు మహేష్, వేముల పుష్ప, నాయకులు బుగ్గ మల్లయ్య, బందారపు నరేష్, పల్లెర్ల బిక్షపతి, పల్లెర్ల కిషన్, పల్లర్ల మల్లేష్, బండారు చింటూ, బండారు ప్రశాంత్ తదితరులు పాల్గొని బాధితులకు ధైర్యం చెప్పారు.



# సిగ్మా స్టైల్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా సినిమా 'సిగ్మా'. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా జూలై 31న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా నుంచి 'సిగ్మా స్టైల్' అంటూ ఈ సినిమా మ్యూజిక్ వీడియోను మలయాళ నటుడు--నిర్మాత దుల్కర్ సల్మాన్ లాంచ్ చేశారు. "సందీప్--ఫరియాల డైనమిక్ పెర్ఫార్మెన్స్, ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాస్ ట్యూన్, జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్‌తో 'సిగ్మా స్టైల్' పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి" అని యూనిట్ పేర్కొంది.

# ఆ వార్తల్లో నిజం లేదు!



కన్నడ అగ్ర హీరో యష్ నటించిన పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్' రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇది గ్యాంగ్‌స్టర్ డ్రామా అయినప్పటికీ.. మనోవిశ్లేషణతో కూడిన కథాంశమని, డార్క్ క్యారెక్టర్‌ను దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పాజిటివ్‌గా ఆవిష్కరించారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో యష్ తెలిపారు. దీంతో గ్యాంగ్‌స్టర్, సైకలాజికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారని తెలుస్తున్నది. తాజాగా ఈ సినిమాను రీషూట్ చేస్తున్నారని, ఫైనల్ అవుట్‌పుట్‌పై యష్ సంతృప్తిగా లేరని, అందుకే రిలీజ్ డేట్ పలుమార్లు వాయిదా పడిందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. వీటిపై చిత్రబృందం స్పందించింది. ఇవన్నీ పుకార్లని, నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తి చేసుకొని ప్రస్తుతం ప్రమోషనల్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టామని స్పష్టం చేసింది. ఈ సినిమాను ఇంగ్లిష్ భాషలో కూడా రిలీజ్ చేస్తుండటంతో హీరో యష్ విదేశీ ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ సినిమా ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకురానుందని సమాచారం. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా తదితరులు ప్రధాన పాత్రల్ని పోషించారు.




# అదే పెద్ద చాలెంజ్!

ప్రస్తుతం పూజాహెగ్డే దక్షిణాది చిత్రసీమపైనే పూర్తిగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా తెలుగులో పూర్వ వైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇండస్ట్రీ పరిస్థితులపై ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రస్తుతం థియేట్రికల్ సినిమా చాలా ఇబ్బందుల్లో ఉందని, విడుదలైన వెంటనే కంటెంట్ ఎలాంటిదో ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తున్నారని, ఫేక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వారిని మభ్యపెట్టడం సాధ్యం కాదని చెప్పింది. నేడు వినోదానికి అనేక వేదికలు అందుబాటులో ఉన్నాయని, ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే కథలో బలమైన ఉద్వేగాలు ఉండాలని అభిప్రాయపడింది. కమర్షియల్ సినిమాల్లో నటించడం చాలా సులభమని అనుకుంటారని, కానీ వాటిలోనే ఎన్నో సవాళు ్లంటాయని పూజా హెగ్డే చెప్పింది. 'మంచి కథలో అభినయంపై దృష్టిపెడితే సరిపోతుంది. కానీ కమర్షియల్ సినిమా అలా కాదు. గ్లామర్‌తో పాటు డ్యాన్స్, ఎమోషన్స్..ఇలా అన్ని అంశాల్లో సమతుల్యం పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. అన్నింటికంటే కమర్షియల్ సినిమానే పెద్ద చాలెంజ్' అని పూజాహెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే నాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

# శరవేగంగా చిరు 158

అగ్ర కథానాయకుడు చిరంజీవి 158వ చిత్రం తాలూకు రెగ్యులర్ షూటింగ్ ఇటీవలే మొదలైన విషయం తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చిరంజీవి-దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడులోని పొల్లాచ్చిలో ఈ సినిమా కీలక షెడ్యూల్ జరుగుతున్నది. ఇందులో చిరంజీవితో పాటు ప్రధాన తారాగణమంతా పాల్గొంటున్నారు. ప్రతీకార నేపథ్య కథాంశమిదని, హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని, చిరంజీవి మునుపెన్నడూ చూడని మేకోవర్‌తో కనిపిస్తారని చిత్రబృందం చెబుతున్నది.





# యువత చేసే సందడి

'మ్యాడ్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు రామ్ నితిన్. తాజాగా ఆయన మరో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నాడు. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. గురువారం హీరో రామ్‌నితిన్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దీనికి 'ఫన్, ఫెస్ట్, కెయాస్..బిగిన్స్ సూన్' అంటూ పెట్టిన క్యాప్షన్ ఆకట్టుకుంటున్నది. కలర్‌ఫుల్ కాలేజ్ వైబ్స్‌తో పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. కాకినాడ కాలేజీ నేపథ్యంలో జరిగే కథ ఇదని, నేటి ట్రెండ్‌కు అనుగుణంగా యువతను మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సింజిత్ యెర్రమల్లి, దర్శకత్వం: వెంకటేష్ నిమ్మలపూడి.

# దసరా బరిలో కింగ్ 100?

అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం తన వందో చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు 'కింగ్100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా షూటింగ్‌ను కంప్లీట్ చేసి పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెడతారని సమాచారం. ఓ సామాన్యుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, ఇందులో నాగార్జున విభిన్న కాలాల్లో, డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. ఏఐ సాంకేతికతతో నాగార్జున రెట్రోలుక్స్‌ని రీక్రియేట్ చేయబోతున్నారని తెలిసింది. ఆయన లుక్స్‌తో పాటు క్యారెక్టర్ ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని దసరా బరిలో దించేందుకు నాగార్జున సన్నాహాలు చేస్తున్నారట. టబు కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని నాగార్జున స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.

